# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 325: అంతర్ద్వారం తెరచుట
# జూన్ 22, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 2, పేజీలు 203-209 నుండి తీసికొనబడినవి

**స్వామి! మాకున్న జ్ఞానం గురించి మా తప్పును అర్థం చేసుకున్నాము. చిత్ అంటే సంపూర్ణ జ్ఞానం; పక్షపాత జ్ఞానం, అసంపూర్ణ జ్ఞానం కాదని విశదీకరించి చెప్పారు. ఈ చిత్ అనే దానిని ఎలా అభివృద్ధి చేసుకోవాలి?**

భగవాన్: చిత్ అనే దానికి ఆధ్యాత్మికత అత్యవసరం. ఇంకే మార్గం ద్వారా పెంచుకోవడానికి సాధ్యం కాదు. ఆధ్యాత్మిక జ్ఞానం ఉంటే అర్థం చేసుకోవడానికి సులభం అవుతుంది. అప్పుడు మీకు సంపూర్ణ జ్ఞానం కలుగుతుంది. అదే చిత్. లేకుంటే మీకు వచ్చేది పుస్తక జ్ఞానం, పై పై జ్ఞానం, సాధారణ జ్ఞానం; అనుభవ జ్ఞానం కాదు. అదే చిత్. ఇది ఆధ్యాత్మిక మార్గం లోనే సాధ్యం.

ఒక చిన్న ఉదాహరణ. భూమిలో ఒక విత్తనం నాటావు. అది మొక్కౌతుంది. కానీ అదే విత్తనాన్ని ఒక డబ్బాలో పెడితే మొలుస్తుందా? అసాధ్యం. అదే విధంగా, చిత్ అనే మొక్క ఆధ్యాత్మికత అనే భూమిలో మొలుస్తుంది, సంసార సుఖములనే డబ్బాలో మొలవదు. ఆ చిత్ అనేది సత్యమైనది.

**స్వామి! మా కాలేజీలలో ఈ చిత్ అనేది దొరకదని ఇప్పుడు అర్థమైంది. కానీ ఈ చిత్ మా జీవితాలలో అత్యవసరమైనది. ఈనాటి ప్రపంచంలో మీరు అవతరించిన భగవంతుడు. మీ దయతో ఈ చిత్ అనే దానిని ప్రసాదించకూడదా?**

భగవాన్: భగవంతుడే అంతా చేసేస్తే ఇంక మీరేమి చేస్తారు? భగవంతుడు ఇచ్చిన మనసు, బుద్ధి ఎలా ఉపయోగపెడతారు? భగవంతుడే అంతా చేస్తే మీకు ఇచ్చిన మనసు, బుద్ధి వంటి దివ్యమైన పరికరములు వ్యర్థమే కదా? తల్లి అన్నం వండి వడ్డిస్తుంది. కానీ బిడ్డ బదులు ఆమె తినలేదు కదా! బిడ్డకు దెబ్బ తగిలితే తల్లికి బాధ వేస్తుంది, కానీ తనకి తాను కట్టు కట్టుకోదు కదా!

పొటేటో, చపాతి ఉండే పళ్ళెం ముందు కూర్చుంటే సరిపోదు. వాటిని చేతిలోకి తీసుకొని తినాలి. “పొటేటో, చపాతి, పొటేటో, చపాతి” అని పదే పదే అన్నంత మాత్రాన ఆకలి తీరుతుందా? చేటికి, నోటికి పని పెట్టాలి కదా? అదే విధంగా మీ మనసును, బుద్ధిని ఉపయోగించాలి.

అప్పుడు అన్నీ అర్థమౌతాయి. మీ కృషితో భగవంతుని అనుగ్రహం లభిస్తుంది. కృషితో ఋషి కూడా అవ్వొచ్చు. భగవంతుని తలచుకుంటూ మీ కర్తవ్యం నెరవేర్చండి. కృష్ణుడు కూడా అర్జునుడితో అదే చెప్పాడు. మాం అనుస్మర యుధ్య చ, “ఓ అర్జునా! నన్ను తలచుకొని యుద్ధం చేయి!” రామ నామమును తలుస్తూ హనుమంతుడు గొప్ప సాగరాన్నే దాట గలిగాడు. కనుక మీ కర్తవ్యం నెరవేరిస్తే ఏమైనా సాధించగలరు.

**స్వామి! కొంత మంది సాధకులు ఉపవాసం, జాగరణ వంటివి చేసి అవి సాధనలు అని భావిస్తారు. వాటి యొక్క ప్రాముఖ్యత, అంతరార్థం తెలియ చేయండి.**

భగవాన్: భారత దేశంలో ఉండే ఆచారాలు, సంప్రదాయాలు, పద్ధతులు ఎంతో అంతరార్ధంతో కూడినవి. అవి పాటించే సాధకులకు తప్పకుండా దివ్యానుభావాలు కలుగుతాయి. కానీ ఈనాడు మనుషులు బాహ్య ఆడంబరాలు, ఆచారాలు చేస్తున్నారు కానీ వాటి యొక్క అంతరార్ధమును తెలుసుకోవడం లేదు. కనుక అవి మొట్ట మొదట ఎందుకు ఆవిర్భవించినవో మరచిపోయారు. ఇప్పుడు అన్ని ఆచారాలు యాంత్రికంగా, ఏకరీతిగా ఉంటున్నాయి. స్పష్టంగా విశదీకరించి చెప్పే వాళ్ళే లేరు. చాలా మందికి ఈ సూక్ష్మమైన విషయములు తెలియవు. కనుక శ్రద్ధతో సాధన చేసే వారే కనబడడం లేదు. మనిషి మారక్కరలేదు. మనసు మారాలి.

ఒకవేళ ఎక్కడో దూరపు ప్రదేశానికి వెళ్ళినప్పుడు దారిలో తినడానికి తిండి లేకపోతే దానిని ఉపవాసం అంటారా? సాధనకు ఉపయోగ పడుతుందా? రోగి మామూలు భోజనం తినలేడు. అది ఉపవాసం అవుతుందా? దాని వల్ల ఏమి లభిస్తుంది? భగవంతుని నీలో అనుభవిస్తే అదే ఉపవాసము. ఉప అనగా దగ్గిర. వాసము అంటే నివసించడం; ఉపవాసం అంటే భగవంతునికి దగ్గరగా నివసించడం. అంటే లోన ఉన్న భగవంతుని అనుభవించి, భగవంతుడిని ధ్యానించాలి.  ఇదే నిజమైన ఉపవాసం. ఈనాడు మనం చూస్తుంటాము. ఏకాదశికి ఉపవాసం చేస్తే మరుసటి రోజు రెండింతలు తింటారు. మధ్వులు (మధ్వాచార్య శిష్యులు) భీష్మ ఏకాదశి రోజు ఉపవాసం చేస్తారు. ఆ రోజు వారు ఉమ్మి కూడా మింగరు.

కర్నాటక దేశంలో "బిడ బెడి బిట్టు కెడ బెడి" అంటారు కన్నడంలో. అంటే "వదిలేసి పాడు చేసుకోకు." ఏదైనా వదిలేస్తే మళ్ళీ తెచ్చుకోకు. అది ఒక చెడ్డ అలవాటు. అలా కాకుండా వారు పిండి తయారు చేసుకొని, దానిని మూడు రోజులు నిల్వ ఉంచుతారు. దాంతో మంచి దోశలు వేసుకుంటారు. కనుక కన్నడంలో అంటారు, "ఇందు అడిదె ఏకాదశి ఒందు తిండు నలవత్తు దోశ." అంటే "నెలలో ఒక రోజు ఉండే ఏకాదశి కొరకు నలభై దోశలకి తయారు చేసారు." ఇదా ఉపవాసం? కాదు, కాదు.

జాగరణ ఎందుకు చేయాలి? జాగరణ అంటే రాత్రంతా మేలుకొని ఉండడం ఎందుకు చేస్తారు? సంసార సుఖములు, విషయ వాసనలు, ప్రాపంచిక సౌకర్యాల నుండి దూరంగా ఉండడానికి. అటువంటి లౌకిక విషయాలను అలక్ష్యం చేసి, ఆత్మపై జాగరణ చేయాలి.

లోన ఉండే దైవత్వం పై జాగరణ చేసి ప్రాపంచిక బాధలను అలక్ష్యం చేయాలి. కానీ జాగరణ పేరుతో ఈనాడు ఏమి చేస్తున్నారు? రాత్రంతా కూర్చొని పేకాట ఆడి, మూడు నాలుగు సినిమాలు చూస్తున్నారు. గూర్ఖాలు, ఆసుపత్రిలో నర్సులు, రైల్వే స్టేషను మాస్టర్లు డ్యూటీ వల్ల రాత్రంతా నిద్రపోరు. అది జాగరణ అవుతుందా? కాదు, కాదు. నిద్ర పోక పోవడమనేది బాహ్య ఆచారం. ఈ ఆచారాలను లోన ఎలా పాటించాలో తెలుసుకోవాలి. యాంత్రికంగా చేస్తే హాస్యాస్పదంగా ఉంటుంది, అందరూ ఎగతాళి చేస్తారు.

**స్వామి! కొందరు పూజ చేయమంటారు, కొందరు ధ్యానం చేయమంటారు, కొందరు పారాయణం చేయమంటారు, మరి కొందరు జపం చేస్తే మంచిదంటారు. నాకు ఏది పాటించాలో తెలియడం లేదు. వీటిల్లో ఏది సాధన చేస్తే మంచిదో తెలియచేయండి.**

భగవాన్: పూర్తి ప్రేమతో, నిస్వార్ధంతో, చిత్తశుద్ధితో, ఏకాగ్రతతో, శరణాగతితో ఏది చేసినా భగవంతుడిని అనుభవించవచ్చు.

నీకు ఏది అనుకూలమో ఆ మార్గమును పాటించు. నీకు శాంతి, ఆనందమును ఇచ్చే ఏ సాధన అయినా చేయవచ్చు. కానీ ఎప్పుడూ పరులను అనుకరించకు. వేరే వారు చెప్పే మాటలు, మార్గాలు పట్టుకొని పోవద్దు. నీ మార్గములోనే ఉండు. లేకుంటే నీ దారి కూడా తప్పిపోతావు. అనుకరించడం మనుష్యులు చేసేదైతే సృష్టించడం దైవం చేసేది.

వేరే వారిని అనుకరిస్తే ఎలా కోల్పోతాడో నిరూపించడానికి ఒక చిన్న ఉదాహరణ. ఒక సంతలో మామిడి పండ్లు బాగా దొరికే కాలంలో పండ్లు అమ్మేవాడు "ఇక్కడ మంచి మామిడి పండ్లు అమ్మబడును," అని ఒక బోర్డు మీద వ్రాసుకొని కొట్టు ఎదురుగా పెట్టుకున్నాడు. ఒకాయన వచ్చి, "అయ్యా! ఈ బోర్డు మీద అలా వ్రాసారేంటి? ఇది పండ్ల సంతే కదా, మళ్ళీ 'ఇక్కడ' అని ఎందుకు జోడించారు? అనవసరం కదా? 'ఇక్కడ' అనే పదం తీసేయండి," అని సలహా ఇచ్చాడు. సరే అని పెయింటరును పిలిపించి 'ఇక్కడ' అనే పదాన్ని తీసేయించాడు.

ఇప్పుడు ఆ బోర్డు మీద "మంచి మామిడి పండ్లు అమ్మబడును," అని ఉంది. ఇంకొక మనిషి వచ్చి, "నువ్వు తెలివి ఉన్నవాడిలా కనిపించడం లేదు. అసలు ఈ బోర్డు మీద ఏమి వ్రాసావో చదువుకున్నావా? ఇది మామిడి పండ్ల కాలం. అని కొట్లలో మామిడి పండ్లే అమ్ముతున్నారు. నువ్వు మళ్ళీ 'మామిడి పండ్లు' ఇక్కడే అమ్ముతున్నట్లు ప్రత్యేకంగా చెప్పాలా? ఆ 'మామిడి' అనే పదాన్ని తీసేయడం మంచిది," అన్నాడు.

కొట్టు వాడు పెయింటరును మళ్ళీ పిలిపించి అది తీసి వేయించాడు. ఇప్పుడు బోర్డు మీద "మంచి పండ్లు అమ్మబడును" అని వ్రాసి ఉంది. ఇంకొక మనిషి వచ్చి "ఇదేమి పిచ్చి వ్రాత? ఇక్కడ ఎవరైనా చెడు పండ్లు అమ్ముతున్నారా? 'మంచి పండ్లు' అని మరీ చెప్పడం పిచ్చిగా ఉంది. 'మంచి పండ్లు' అనే దానిని చెరిపేయడం మంచిది," అని సలహా ఇచ్చాడు.

కొట్టు వాడు అది నిజమే కదా అనుకొని చెరిపేయిస్తే ఇంక "అమ్మబడును" అని మాత్రమే మిగిలింది. కొట్టువాడికి మంచి కోరే వాడు ఒకడు అటు వెళ్తూ బోర్డు చూసి ఆశ్చర్యపోయాడు. "ఇదేంటి నీకు పిచ్చా? అసలు బోర్డు చదివావా? 'అమ్మబడును' అంటే ఏంటి? బోర్డు అమ్మబడునా?" అనగానే ఆ పెయింటరును మళ్ళీ పిలిపించి 'అమ్మబడును' అన్న పదాన్ని కూడా తీసేయించాడు. ఇప్పుడు ఖాళీ బోర్డు మిగిలింది. చివరికి పెయింటరు రెండు బిల్లులు ఇచ్చాడు. ఒకటి ముందు వ్రాసిన అక్షరాలన్నిటికీ, ఇంకొకటి ఒక్కొక్క పదాన్ని మళ్ళీ చెరిపేయడానికి. అందరి మాటలు విన్న కొట్టు వాడికి ఏమయింది? బోర్డు, దుడ్డు రెండూ పోగొట్టుకున్నాడు. వేరే వారి మాటలు, మార్గాలు అనుసరిస్తే నీ గతి కూడా ఇంతే.

నీ గురువు నీకు పని చేసే విధానమును చెప్తాడు. అందరికీ అదే విధానం చెప్పడు. సాధన మార్గాలు నీ స్తోమత, శక్తి, సామర్థ్యము, వివేకముల బట్టి చెప్తాడు.

వచ్చే వారం ప్రొ. అనిల్ కుమార్ గారి రచనల ద్వారా మరి కొన్ని స్వామి వారి ఉపదేశాలను తెలుసుకుందాం. ధన్యవాదములు.

ఓం సాయి రామ్